సాక్షి కర్నూలు

ఆదివారం | 10 | ఆగస్టు | 2025



కేంద్ర బలగాల కవాతు

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం కర్నూలులో కేంద్ర సాయుధ బలగాలు ర్యాలీ నిర్వహించాయి. కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ సాగింది. 8లో ▸



అందాల 'గుమ్మితం'

ఇందిరేశ్వరం సమీపంలోని గుమ్మితం వద్ద జలపాతం పరవళ్లు తొక్కుతోంది. వర్షం నీరు కిందకు దుముకుతూ సరికొత్త అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. 8లో ▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,774
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,569

న్యూస్‌రీల్

జీడీపీలోకి వరద నీరు చేరిక



గోనెగండ్ల: కురుస్తున్న వర్షాలతో గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ)లోకి 2వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. హంద్రీ- నీవా కాలువ నుంచి 160, ఎల్లెల్సీ నుంచి 40 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వచ్చి చేరుతోందని చెప్పారు. ప్రాజెక్ట్‌లో 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 1.8 టీఎంసీల నీరు ఉందని తెలిపారు.

నేడు 'సోర్సింగ్ ఎంప్లాయీస్' విస్తృత స్థాయి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరుగుతుందని ఉమ్మడి జిల్లా నాయకులు రాముడు, నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్‌ను సంస్థాగతంగా పటిష్టం చేసేందుకు రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరుగుతుందని, సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ హాజరు కావాలని తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో నూ ప్రజలను ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోగులకు రాఖీ కట్టిన వైద్యులు, నర్సులు



రాఖీ కడుతున్న నర్సు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు వైద్యులు, నర్సులు, సిబ్బంది సాంప్రదాయబద్ధంగా రాఖీలు కట్టి హారతి ఇచ్చి బొట్టు పెట్టారు. రక్షా బంధన్ పండుగను శనివారం కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో రోగుల మధ్య వినూత్నంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కర్నూలు సెంటర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు రోగులకు మానసిక బలం, ఆనందం కలిగిస్తాయన్నారు. వారు కోలుకునే ప్రక్రియలో కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయన్నారు. యూరోగైనకాలజిస్టు డాక్టర్ శిల్పా చౌదరి, పల్మనాలజిస్టు డాక్టర్ సువర్ణలక్ష్మి కల్లి తదితరులు పాల్గొన్నారు.


దొంగ హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సీపీఐ నాయకుల ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గద్దెనెక్కారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ఆరోపించారు. సీపీఐ 24వ జిల్లా మహాసభలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాజ్‌విహార్ నుంచి పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అనంతరం ఏపీ టూరిజం పున్నమి సమావేశ భవనంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన ప్రతినిధుల సభను నిర్వహించారు. ఆయా సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తోపాటు సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, రామాంజనేయులు, శేఖర్ తదితరులు హాజరయ్యారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20 వేల కోట్లను కేటాయించాలని కోరారు. సీపీఐ నాయకులు జగన్నాథం, లెనిన్ బాబు, ఎస్.మునెప్ప, జె.లలితమ్మ, శ్రీనివాసులు, చంద్రశేఖర్, షాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి స్పౌజ్ పింఛన్లు దాదాపు 20 మంజూరయ్యాయి. వితంతు మహిళల ఆధార్, భర్త డెత్ సర్టిఫికెట్ సచివాలయ ఉద్యోగులు అప్‌లోడ్ చేసేందుకు టీడీపీ నేతలు ఒక్కొక్కరి నుంచి రూ.6వేలు వసూలు చేసినట్లు సమాచారం. టీడీపీ నేతలకు డబ్బులు ముట్టిన తర్వాతనే సచివాలయ ఉద్యోగులు వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. అంటే కూటమి పార్టీల నేతలు సచివాలయ ఉద్యోగులను సైతం తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

పింఛను ఇప్పించాం.. ఒక నెల నొక్కేస్తాం!

స్పౌజ్ పింఛన్లపై 'తమ్ముళ్ల' పెత్తనం

- టీడీపీ నేతల ఆధ్వర్యంలోనే పంపిణీ
- పింఛను ఇచ్చినట్లు ఫొటోలు దిగడం, డబ్బు లాక్కోవడం
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇదే తంతు
- ముడుపులిస్తేనే సచివాలయాల్లో సర్టిఫికెట్ల అప్‌లోడ్



కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): స్పౌజ్ పింఛన్ల సొమ్ము అధిక శాతం గ్రామాల్లో తెలుగు తమ్ముళ్లు మింగేశారు. కూటమి ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి స్థానంలో భార్యలకు వితంతు పింఛన్లు మంజూరు చేసింది. మా నుంచే మీకు పింఛన్ వచ్చింది.. మొదటి నెల మొత్తం మాకే అంటూ తెలుగు తమ్ముళ్లు మహిళల నుంచి లాక్కునట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు అవుతోంది. ఈ కాలంలో కొత్త పింఛన్ ఒక్కటంటే ఒక్కటీ ఇవ్వలేదు. స్పౌజ్ పింఛన్లు కొత్తగా ఇచ్చినవి కాదు. పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి స్థానంలో భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలావరకు గ్రామీణ ప్రాంతాల్లో స్పౌజ్ పింఛన్లపై కూటమి పార్టీల నేతలు ఆధిపత్యం చెలాయిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

పింఛన్ ఇచ్చినట్లు ఫొటో.. ఆ వెంటనే లాగేసుకోవడం

స్పౌజ్ పింఛన్లు ఆగస్టు నెలకు సంబంధించి కర్నూలు జిల్లాకు 3,527, నంద్యాల జిల్లాకు 3,443 మంజూరయ్యాయి. పలుచోట్ల టీడీపీ నేతలే స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. వితంతు మహిళలకు పింఛన్ ఇచ్చినట్లు ఫొటోలు దిగి ఆ వెంటనే పింఛను మొత్తాన్ని లాగేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం బయటకు చెబితే పింఛను లేకుండా చేస్తామని బెదిరింపులకు గురిచేయడంతో లబ్ధిదారులు మిన్నకుండిపోయినట్లు చర్చ జరుగుతోంది. నందవరం మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు ఇచ్చినట్లే ఇచ్చి 'తమ్ముళ్లు' డబ్బు తమ జేబుల్లో వేసుకున్నట్లు సమాచారం.



మద్దికెరలో స్పౌజ్ పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పింఛన్లను అడ్డుకున్న తెలుగు తమ్ముళ్లు

- ➡ వితంతు మహిళలకు స్పౌజ్ పింఛన్లు రాకుండా తెలుగు తమ్ముళ్లు అడ్డుపడినట్లు తెలుస్తోంది.
- ➡ టీడీపీ నేతలు ఆమోదం తెలిపిన మహిళల ఆధార్, భర్త డెత్ సర్టిఫికెట్‌లను సచివాలయ ఉద్యోగులు అప్‌లోడ్ చేస్తున్నారు.
- ➡ 2023 నవంబర్ వరకు పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యలకు వితంతు పింఛన్లు మంజూరు చేశారు.
- ➡ ఉమ్మడి జిల్లాలో 1,100 మంది మహిళలకు వితంతు పింఛన్ రాకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నట్లు తెలుస్తోంది.
- ➡ వైఎస్సార్‌సీపీ ముద్ర వేయడం, ముడుపులు ఇవ్వకపోవడం కారణాలతో ఆధార్, డెత్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయలేదనే చర్చ జరుగుతోంది.
- ➡ ప్రధానంగా పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్ నియోజక వర్గాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉన్నట్లు సమాచారం.



శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలోని పరిమళ తీర్థంలో తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

శ్రీమఠం.. భక్తి పరిమళం

- పరిమళ తీర్థంలో తొలిసారి అంగరంగ వైభవంగా తెప్పోత్సవం
- ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఘనంగా ఊంజల సేవ

మంత్రాలయం: వేదభూమిలో తొలి వేడుక.. సద్గురు రాఘవేంద్రుడి క్షేత్రంలో శుభకార్యం.. తిరుమల వేంకన్న, శ్రీశైల మల్లన్న తరహాలో శ్రీమఠంలో పురుడోసుకున్న తెప్పోత్సవం.. చూసిన కనులదే భాగ్యం..ఈ వేడుకను చూసి భక్తజనం పరవశించింది. తుంగభద్ర నది తీరంలో ఆధ్యాత్మికభావం వెల్లివిరిసింది. శ్రీ రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాలు రెండోరోజు శనివారం వైభవంగా సాగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో సూర్యాస్తమయ సమయాన ఉత్సవమూర్తి తెప్పోత్సవం శోభాయమానంగా సాగింది. తొలుత రాఘవేంద్రస్వామి మూల బృందావనం నుంచి ఉత్సవమూర్తిని మేళతాళాలతో శ్రీమఠం నుంచి పరిమళ తీర్థం పుష్కరిణికి చెంతకు తీసుకొచ్చారు. అక్కడ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిమళ తీర్థానికి పూజలు చేసి ఉత్సవమూర్తిని తెప్పపై అధిష్ఠింపజేశారు. ఉత్సవమూర్తికి పుష్పార్చనలు, హారతులు పట్టి తెప్పోత్సవానికి అంకురార్పణ పలికారు. పుష్కరిణి చుట్టూ వేలాది భక్తుల హర్షధ్వానాలు, వేద ఘోషలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలు విహరించారు.

కనుల పండువగా శాఖోత్సవం

వేడుకల్లో భాగంగా శ్రీమఠంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం రాఘవేంద్రుల మూల బృందావనానికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. పూజా మందిరంలో రాములోరి సంస్థాన పూజ చేపట్టారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ నిర్వహించారు. అక్కడే శాఖోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అలాగే యోగీంద్ర మంటపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పుత్తూరు జగదీష్ సంగీత విభావరి, హుడిపి భార్గవి నృత్య తండా బృందం యోగా నృత్య, భరతనాట్య ప్రదర్శనలు మైమరిపించాయి. మద్రాసుకు చెందిన విదూషి కన్యాకుమారి వయోలిన్ కచేరి వీనుల విందు చేసింది. వేడుకల్లో తెలంగాణ పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ఈఈ సురేష్ కోనాపూర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరాధనోత్సవాల్లో శనివారం అశేష భక్తజనం మధ్య ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న పండితులు

పురుగుమందుల పరీక్ష ల్యాబ్‌కు ఎన్ఏబీఎస్ గుర్తింపు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని క్రిమి సంహారక మందుల పరీక్షా కేంద్రానికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబోరేటరీ (ఎన్ఏబీఎస్) గుర్తింపు లభించింది. ఈ ల్యాబ్ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తోంది. కర్నూలు పురుగుమందుల నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ ప్రయోగశాల 2010 ప్రాంతంలో వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటైంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే పురుగుమందుల శాంపిల్స్‌ను ఈ ల్యాబ్‌లో పరీక్షిస్తారు. మొదటిసారిగా కర్నూలులోని పురుగుమందుల పరీక్ష కేంద్రానికి ఎన్ఏబీఎస్ గుర్తింపు లభించడం పట్ల వ్యవసాయ శాఖ అధికారులు హర్షం ప్రకటించారు. ఇదిలాఉంటే ఈ ప్రయోగశాలకు ప్రభుత్వం ఎలాంటి పోస్టులు మంజూరు చేయలేదు. మామూలుగా అయితే ఈ ల్యాబ్‌కు ఏడీఏ, ఏఓ, ఏఈఓలు, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. ల్యాబ్ అయితే ఏర్పాటైంది తప్ప ఒక్క పోస్టు కూడా మంజూరు చేయని పరిస్థితి. ప్రస్తుతం ఏఓ, ఏడీఏ, ఏఈఓలందరు డిప్యూటేషన్‌పై మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం.



కర్నూలులోని పురుగుమందుల పరీక్ష కేంద్రం

తూతూ మంత్రంగా ఆదివాసి దినోత్సవం

- పత్తికొండ ఎమ్మెల్యే మినహా మిగిలిన ప్రజాప్రతినిధులందరూ గైర్హాజరు

కర్నూలు(సెంట్రల్): ఎంతో అట్టహాసంగా జరగాల్సిన ప్రపంచ ఆదివాసి దినోత్సవం తూతూమంత్రంగా జరిగింది. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ మినహా ఇతర ప్రజాప్రతినిధులెవరూ హాజరు కాలేదు. ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేకపోవడంతో ప్రజాప్రతినిధుల ముఖం చాటేసేట్లు తెలుస్తోంది. కాగా.. ప్రజాప్రతినిధుల తీరుపై గిరిజన ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఏడాదికి ఒక్కసారి జరిగే వేడులకు కూడా హాజరయ్యే ఓపిక వారికి లేదా అని ప్రశ్నించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, గిరిజన సంఘాల పెద్దల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. 500 మంది గిరిజనులు ఉన్న తండాలను పంచాయతీలుగా ప్రకటించినట్లు చెప్పారు. లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు కైలాస నాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, నాయకులు యోగేస్ నాయక్, రామచంద్రనాయక్, సూర్య, మాలతి, గిరిజన సంక్షేమ అధికారి కొండయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక పాల్గొన్నారు.



గిరిజన నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 879 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం శనివారం సాయంత్రం సమయానికి 879.10 అడుగులకు చేరుకుంది. శ్రీశైలానికి వస్తున్న ఇన్‌ఫ్లోల కన్నా ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో నీటిమట్టం తగ్గుతుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 91,641 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,05,336 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 67,368 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 32,750 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,818 క్యూసెక్కుల నీటిని వదిలారు. కుడిగట్టు కేంద్రంలో 14.982 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 15.776 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 183.4198 టిఎంసీల నీరు నిల్వ ఉంది.

తమ్ముళ్ల ఇసుక దందా

- ఆదోనిలో టిప్పర్ సీజ్ చేసిన పోలీసులు
- బీజేపీ ముఖ్య నేత ఒత్తిళ్లు
- కౌతాళం మండలం వల్లూరు నుంచి సరఫరా
- ఒక టిప్పర్ ధర రూ.8వేల పైనే..
- కౌతాళం టీడీపీ నేత కుమారుని హస్తం

ఇసుకాసురులను వెన'కేసు'కొస్తున్నారు!



నదిచాగి వద్ద ఉన్న ఇసుక డంప్

కౌతాళం/ఆదోని అర్బన్: ఓ వైపు ప్రజాప్రతినిధులు, మరో వైపు అధికారులు ఇసుకాసురులకు అండగా నిలుస్తుండటంతో దందా మూడు ట్రిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది. వర్షాల నేపథ్యంలో ఇసుక దొరకడం లేదని పైకి చెబుతున్నా.. టీడీపీ నేతలు ఇప్పటికే భారీగా డంప్ చేసిన ఇసుకతో కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు అధికంగా ఉండే కౌతాళంలో అధికార పార్టీ నేత అండతో రీచ్ టెండరు దారులు దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాటలు ఈ ప్రాంతంలో అమలుకు నోచుకోని పరిస్థితి. డబ్బులు ఇస్తేనే అది కూడా పది రెట్లు అధికంగా ఇస్తేనే ఇసుక దొరకని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. కౌతాళం మండలంలో గుడికంబాలితో పాటు మరళి, నదిచాగి రీచ్‌లు ఉన్నాయి. వర్షా కాలాన్ని ముందే గ్రహించిన టెండరుదారులు ఇసుకను బయట ప్రదేశంలో అక్రమంగా డంప్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ డంప్ నుంచి ఇసుకను తీసుకుని పోవాలంటే టిప్పర్‌కు రూ.8వేలు చెల్లించాల్సిందే. ప్రభుత్వం నిర్ణ యించిన ధర టన్నుకు రూ.40 కాగా 20 టన్నులకు రూ.800 చెల్లించి టిప్పర్ ఇసుకను నింపుకోవచ్చు. కానీ ప్రస్తుతం రూ.8 వేలు ఇచ్చుకోవాల్సి వస్తుండటంతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇదంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోంది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఇసుక దందాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.



మరళి వద్ద ఉన్న ఇసుక డంప్



పట్టుబడిన టిప్పర్

టిప్పర్‌ను వదిలేయండి..

శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్ (ఏపీ 07 టీబీ 9118) ఆదోని టూటౌన్ పోలీసులు సీజ్ చేశారు. వరుసగా రెండో శనివారం, ఆదివారం సెలవులు ఉండడంతో జిల్లా మైనింగ్ అధికారులకు రుసుం వేస్తే గానీ ఇసుక టిప్పర్ బయటకు రాదు. మొన్నటి వరకు ఆదోని డివిజన్ పరిధిలో కూటమి నేతలు రాజకీయంగా పట్టునిలుపుకునేందుకు పోటీపడుతూ కేసులు పెట్టుకునే స్థాయికి దిగజారారు. అయితే ఇసుక దందాలో మాత్రం మామూళ్ల కోసం ఒక్కటయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు పట్టుబడిన టిప్పర్‌ను బయటకు రప్పించేందుకు నేతలు చేస్తున్న ప్రయత్నమే నిదర్శనం. కౌతాళం మండలం వల్లూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ఆదోని పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మోహన్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కౌతాళం టీడీపీ నేత రంగంలోకి దిగి ఆదోనికి చెందిన బీజేపీ ముఖ్యనేతను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అడిగిందే ఆలస్యం ఆయన పట్టుబడిన టిప్పర్‌ను వదిలేయాలని పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం టిప్పర్‌ను మైనింగ్ అధికారులకు అప్ప గించామని చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అటు పోలీసులు, ఇటు మైనింగ్ అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం.

కొనసాగుతున్న వర్షాలు



సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామం వద్ద పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు(అగ్రికల్చర్): రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. క్రమంగా అతివృష్టిగా మారుతున్నాయి. ఇప్పటికే పలు మండలాలాల్లో కండపోత వర్షాలు పడుతుండటంతో పంటలు నీట మునుగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఆదోని, హొళగుంద, ఆస్పరి, దేవనకొండ మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నారు. గూడూరులో అత్యధికంగా 69.8 మి.మీ, ఓర్వకల్‌లో అత్యల్పంగా 0.2 మిమీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 13.7 మి.మీ వర్షం కురిసింది. గూడూరులో 69.8 మి.మీ, సీ.బెలగల్‌లో 57.6, తుగ్గలిలో 41.4, గోనెగండ్లలో 41.2, , పత్తికొండలో 21.4, కోడుమూరులో 20.4, మద్దికెరలో 14.6 మిమీ ప్రకారం వర్షాలు కురిశాయి. రానున్న వారం రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

విస్తృతంగా పోలీసు తనిఖీలు



రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కర్నూలు: రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు జిల్లా అంతటా వాహన తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి శనివారం వాహన తనిఖీలు నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ల వారీగా వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, బైకులు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడిన వారికి రోడ్డు భద్రత ప్రాముఖ్యత గురించి వివరించి కేసులు నమోదు చేశారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



కుమ్మరి రూప(ఫైల్)

హొళగుంద: అనారోగ్యంతో మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రూప (13) అనే విద్యార్థిని శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఎల్లార్తి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుమ్మరి శరణప్ప, విశాలాక్షి దంపతులకు ఇద్దరు కుమారులతో పాటు రూప కూతురు. గ్రామానికి సమీపంలోని మాటసుగురు గ్రామం వద్ద ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. రూప గత 8 నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. ఇదిలా ఉండగా హొళగుంద గ్రామంలో శనివారం ఒక్క రోజే వివిధ కారణాలతో నలుగురు మృతి చెందారు. వృద్ధాప్యం, అనారోగ్యం, ప్రమాదాలతో వారం వ్యవధిలో 20 మంది మృతి చెందడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన నూర్‌బాషా

డోన్ టౌన్: డోన్ – అబ్బిరెడ్డిపల్లెకి రహదారిలో పెద్ద వంక వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీసంగుంతల గ్రామానికి చెందిన మృతుడు నూర్‌బాషా (49) (అలియాస్ ఎర్రబాషా ఉరఫ్ వలి) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కొన్నేళ్లుగా పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉన్నాడు. శనివారం బైకు మీద అబ్బిరెడ్డిపల్లె వైపు వెళ్తుండగా.. అదే సమయంలో కృష్ణగిరి మండలం కంభాలపాడు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి త్వరలో జరగబోయే కూతురు పెళ్లి పత్రికలు పంచేందుకు బైకుపై వస్తుండగా పెద్దవంక వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా నూర్‌బాషా తలకు తీవ్రమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. భాస్కర్‌రెడ్డిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. మృతుడు నూర్‌బాషాకు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అందాల 'గుమ్మితం'



కొండపై జాలువారుతున్న వర్షం నీరు

ఆకు పచ్చని అటవీ అందాల మధ్యన ఎత్తైన కొండపై నుంచి పాల నురగ వలే తెల్లని జలపాతాలు నేలకు తాకుతుండటం చూస్తే మనస్సు పులకించాల్సిందే. ఇటీవల నల్లమల అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఇందిరేశ్వరం సమీపంలోని గుమ్మితం వద్ద జలపాతం కళకళలాడుతోంది. వర్షం నీరు కొండ ప్రాంతం నుంచి కిందకు ప్రవహిస్తుండగా సరికొత్త అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ ప్రాంతం పులుల అభయారణ్యం కావడంతో పర్యాటకులకు అనుమతి లేదు. దీంతో జలపాతం అందాలు అడవి కాచిన వెన్నలలా మారిందని చెప్పవచ్చు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా గుమ్మితం వాటర్‌ఫాల్స్‌ను అభివృద్ధి చేసి పర్యాటకులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. – ఆత్మకూరు



నల్లమలలో ఆకట్టుకున్న జలపాతం

దేవరకోన జలకళ



కొలిమిగుండ్ల: తుమ్మలపెంట సమీపంలోని దేవరకోనలో జలపాతం కళకళలాడుతోంది. నాలుగు రోజుల క్రితం ఈ పరిసరాల్లో భారీ వర్షం కురవడంతో జలపాతానికి పెద్ద ఎత్తున నీళ్లు వచ్చి చేరాయి. ఎత్తు నుంచి నీళ్లు పరవళ్లు తొక్కడటంతో కనువిందు చేస్తున్నాయి. ఈ జలపాతాన్ని వీక్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి జనం వస్తున్నారు.

కర్నూలులో కేంద్ర బలగాల కవాతు



పెద్దాసుపత్రి మీదుగా సాగుతున్న కవాతు

కర్నూలు: వినాయక చవితి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కర్నూలులో కేంద్ర సాయుధ బలగాలు (రాపిడ్ యాక్షన్ ఫోర్స్) ర్యాలీ నిర్వహించాయి. శనివారం పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు సాయుధ బలగాలు కవాతులో పాల్గొన్నాయి. కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్, కిడ్స్ వరల్డ్, పూలబజార్, గాంధీ చౌక్, మించిన్ బజార్, కాంగ్రెస్ ఆఫీస్ మీదుగా కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో ర్యాపిడ్



కవాతులో పాల్గొన్న పోలీసు అధికారులు

యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ విజయ్ కుమార్ వర్మ, అసిస్టెంట్ కమాండెంట్ పాపారావు కీర్తి, ఇన్‌స్పెక్టర్లు బి.రాజు, భారతి, సివిల్ సీఐలు నాగరాజరావు, శేషయ్య, మన్సూరుద్దీన్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం కర్నూలు జిల్లా యూనిట్ నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఎంపీపీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.హేమంత్‌కుమార్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై చర్చించారు. సంఘం సభ్యులు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా పి.జగన్నాథం, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీధరమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పీఎస్‌జే సిద్ధు, కోశాధికారిగా కె.సురేష్, ఉపాధ్యక్షులుగా బి.సుధాకర్‌రెడ్డి,జి.లక్ష్మన్న, టి.రవికుమార్,సంయుక్త కార్యదర్శులుగా బి.శ్రీనివాసులు, బి.మహేష్, ఎం.హుసేన్‌సాహెబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సి. అంకాలప్పనాయుడు, ఎం.రియాజ్‌బాషా, బి.బలరామ్, ప్రచార కార్యదర్శులుగా ఎం.సైఫుల్లాబేగ్, కె.సుంకన్న, జి.రాజ్‌కమల్, డివిజినల్ కార్యదర్శులుగా ఎల్.సురేష్‌కుమార్, ఎం.మధు, పి.వెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్లుగా బి.జనార్దన్, ఎం.రాఘవేంద్ర, కె.అయ్యన్న ఎన్నికయ్యారు.

మాజీ ఆర్మీ అధికారి అరెస్టు

● 53 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం



మాజీ ఆర్మీ అధికారి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కర్నూలు: దిన్నెదేవరపాడు గ్రామ శివారులోని తిరుమలగిరి టౌన్‌షిప్‌లో నివాసముంటున్న మాజీ ఆర్మీ అధికారి (బీఎస్ఎఫ్) నగేష్ రావు ఇంట్లో డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈయన ఏడాది కాలంగా బెంగళూరు నుంచి మిలిటరీ క్యాంటీన్‌లో ఇచ్చే మద్యం తీసుకొచ్చి వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ జిల్లా అధికారి సుధీర్ బాబు ఆదేశాల మేరకు సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ బృందాలుగా ఏర్పడి ఇంట్లో సోదాలు నిర్వహించగా 53 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఇవి ఆర్మ్‌డ్ పారా మెడికల్ ఫోర్సెస్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందికి మాత్రమే సరఫరా చేస్తారు. అయితే నగేష్ రావు వ్యాపారం నిమిత్తం మిలిటరీ క్యాంటీన్‌లో కొనుగోలు చేసి రెట్టింపు ధరలకు విక్రయాలు జరుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో మద్యం బాటిళ్లు సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు రెహనా బేగం, ఇంద్రకిరణ్, తేజ, సిబ్బంది రామలింగ, చంద్రపాల్, మధుకిషోర్, రాణి, బషీర్, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

దొంగలు దొరికారు

● చోరీ కేసును ఛేదించిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలో ఈనెల 2వ తేదీన ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. బాధితుడి బంధువు సహకారంతో అదే కాలనీకి చెందిన ముగ్గురు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పట్టుబడిన నిందితులను శనివారం పట్టణ సీఐ యుగంధర్ అరెస్ట్ చూపించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని హుశేన్‌రెడ్డి వీధికి చెందిన బండల వ్యాపారి సంజీవరాయుడు కూతురు పెళ్లి కోసం రూ 1.27 లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు బీరువాలో ఉంచారు. 2వ తేదీన కుటుంబీకులతో చర్చిలో ప్రార్థనకు వెళ్లారు. వారు తిరిగి వచ్చే లోపు ఇంట్లో చోరీ జరిగి నగదు, బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ జయప్ప దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు సంజీవ రాయుడుకు వరసకు కూతురు అయ్యే వరలక్ష్మీతో పాటు అదే కాలనీకి చెందిన సంతోష్, విజయ భాస్కర్, నాగేంద్ర చోరీకి పాల్పడ్డారని తెలుసుకుని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు నేరం అంగీకరించడంతో పాటు చోరీ సొమ్మును అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సారా బట్టీలు ధ్వంసం

అవుకు: కొండమనాయినిపల్లె గ్రామంలో నాటు సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సతీష్ మాట్లాడుతూ..ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఏడు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో అనుమానిత ఇళ్లలో తనిఖీలు చేసి నలుగురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే గ్రామంలోని కొండగుట్టున సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,600 లీటర్ల సారా బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. మునిపాటి రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు కమలాకర్, దౌలత్ ఖాన్‌రమేష్ బాబు స్పెషల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

మా మంచి మాస్టార్



విద్యార్థులను బైక్‌పై తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి

చిత్రంలో బైక్ నడుపుతున్న వ్యక్తి ఓ ఉపాధ్యాయుడు. పేరు సుధాకర్‌రెడ్డి. వడ్డుగండ్ల ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. నంద్యాలలో నివాసముంటూ రోజూ బైక్‌పై పాఠశాలకు వెళ్తారు. అయితే మార్గమధ్యలో నెరవాడ మెట్ట సమీపంలోని గిరిజన బాలికల పాఠశాల వద్ద ముగ్గురు చిన్నారులు బడికి వెళ్లకుండా అక్కడే ఉండటాన్ని గమనించారు. వారు ఆ పాఠశాలలో పని చేసే వ్యక్తుల పిల్లలని తెలుసుకుని వారితో మాట్లాడారు. రోజు బైక్‌పై తనతోపాటు స్కూల్‌కు తీసుకెళ్లి, తిరిగి ఇక్కడే వదిలిపెడతానని మాట్లాడి ఒప్పించారు. ఈ మేరకు ప్రతి రోజు ఉపాధ్యాయుడు వచ్చేలోగా ముగ్గురు విద్యార్థులు ఉడతల అనిల్, దాసరి మంతయ్య, అంజి సిద్ధంగా ఉండి, బైక్‌పై పాఠశాలకు చేరుకుని చదువుకుంటున్నారు. ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి చొరవను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. – పాణ్యం

పెద్దాసుపత్రిలో ఇద్దరికి అరుదైన శస్త్రచికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న వారితో అధికారులు, వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇద్దరు రోగులకు అరుదైన శస్త్రచికిత్సలు చేసి వైద్యులు ప్రాణం పోశారు. శనివారం వైద్యులను తన చాంబర్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్, జనరల్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ హరిచరణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్ ఆపరేషన్ వివరాలు తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే...'బేతంచెర్లకు చెందిన సుమలత(25) నాలుగేళ్లుగా తరచూ రక్తపు వాంతులు, అధిక మాసిక రక్తస్రావం, ప్యాన్‌సెటోపెనియా కారణంగా తరచూ రక్తం ఎక్కించుకుంటూ వచ్చారు. గతంలో ఈవీఎల్ బ్యాండింగ్ చేయించుకున్న ఆమెకు గత నెల 15వ తేదీన ఆసుపత్రిలో చేరారు. అదే నెల 24న ఆమెకు స్ప్లీనెక్టమి అనంతరం స్ప్లీనోరెనల్ షంట్ శస్త్రచికిత్స చేశారు. శస్త్రచికిత్స సమయంలో ఆమె ప్లీహం పరిమాణం 20×15 సెం.మీ.,బరువు 1.5 కిలోలుగా నమోదైంది. ఆమె ప్లేట్‌లెట్‌ల సంఖ్య కేవలం 46 వేలు ఉండగా ఆపరేషన్ అనంతరం అది 5 లక్షలకు చేరుకుంది. ఆపరేషన్ తర్వాత ఆమెకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకపోవడంతో ఈ నెల 9వ తేదీన డిశ్చార్జ్ చేశాం. అలాగే గోనెగండ్లకు చెందిన రంగస్వామి(53) మద్యపానం అలవాటు ఉంది. తరచూ కడుపునొప్పితో బాధపడుతున్న ఆయన గత జూన్ 26న ఆసుపత్రిలో చేరాడు. ఆయనకు వైద్యపరీక్షలు చేయగా క్రానిక్ కేల్సిఫిక్ పాంక్రియాటైటిస్‌గా నిర్ధారణ అయ్యింది. అదే నెల 29వ తేదీన ఆయనకు లాటరల్ పాంక్రియాటికో-జెజునోస్టమి అనే శస్త్రచికిత్స చేశాం. ఆపరేషన్ సందర్భంలో ఆయన పాంక్రియాస్‌లో 10 రాళ్లు ఉండగా అందులో ఒకటి 3×2 సెం.మీ పరిమాణంలో ఉండటం అరుదైన విషయం. ఆపరేషన్ అనంతరం కోలుకోవడంతో జులై 5వ తేదీన ఆయనను డిశ్చార్జ్ చేశాం' అని వివరించారు. ఆపరేషన్ చేసిన వారిలో ప్రొఫెసర్ డాక్టర్ జయరామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ప్రశాంతి, పీజీలు, అనెస్తీషియా వైద్యులు హెచ్ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజీవకుమార్ ఉన్నట్లు తెలిపారు.

గంగలో చేపల వరద!



సబ్ చానల్ వద్ద ఏర్పాటు చేసిన వలలు

మహానంది: నిండుగా ప్రవహిస్తున్న తెలుగుగంగలో జాలర్ల వల నిండుతోంది. వీబీఆర్ నుంచి కృష్ణా జలాలు దిగువగా విడుదల చేయడంతో కాల్వలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ గ్రామం వద్ద మహానంది ఆలయ కోనేరు నీరు వెళ్లేందుకు తెలుగు గంగ కాలువపైన ఏర్పాటు చేసిన సబ్ చానల్ వద్ద స్థానికులు వలలు ఏర్పాటు చేశారు. అక్కడే నీరు తొణుకులు తొక్కుతూ గలగల పారుతుంది. గంగ కాలువలో నుంచి పెద్దపెద్ద చేపలు ఎగిరిపడుతూ వలలో పడుతున్నాయి. ఒక్కొక్క చేప సుమారు 15 కిలోల నుంచి 20 కిలోల వరకు ఉండటంతో వారి పంట పడుతోంది.



వలలోకి వచ్చిపడిన పెద్దపెద్ద చేపలు



కుందూనదిలో నీటి ఉధృతికి అలలు ఏర్పడిన దృశ్యం

కుందూ.. కనువిందు!

వీచే గాలి.. పారే నీరు.. పండే పైరు.. ప్రకృతిలో సహజ సిద్ధమైనవి. వీటిని మనస్సుతో ఆస్వాదిస్తే మధురానుభూతి కలుగుతుంది. శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కుందూనదికి భారీగా నీటిని విడుదల చేశారు. పట్టణ శివారులో కుందూ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో కొన్ని ప్రాంతాల్లో సముద్రపు అలలవలే ఎగిసి పడుతున్నాయి. ఆ దృశ్యాలు అటుగా వెళ్తున్న వారిని కనువిందు చేస్తున్నాయి. – కోవెలకుంట్ల